నమస్తే తెలంగాణ

వరంగల్ హనుమకొండ

5 | గురువారం 18 జనవరి 2024 | WARANGAL HANUMAKONDA


## రేపు 108లో ఈఎంటీ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూ



హనుమకొండ, జనవరి 17: 108లో ఈఎంటీ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఉమ్మడి వరంగల్ జిల్లాల 108 సేవల ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ తెలిపారు. 108 ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్‌ను వెంట తీసుకుని ప్రత్యక్ష ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. బీఎస్సీ, లైఫ్ సైన్స్, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, బీఎస్సీ ఎంఎల్‌టీ పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 30 ఏళ్లలోపు వారు అర్హులని, ఎంపికైన వారు మొదటి మూడు నెలలు హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ జీ-32లో ఈ నెల 19న ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. వివరాలకు 91007 99258 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న మంత్రి సురేఖ, చిత్రంలో మంత్రి సీతక్క

# మహా జాతరను విజయవంతం చేస్తాం

**అధికారులను పరిగెత్తించి పనులు పూర్తి చేయిస్తాం.. మేడారానికి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం**

- పనుల నాణ్యతపై రాజీ పడేది లేదు
- కాంట్రాక్టర్లకు వంతపాడితే కఠిన చర్యలు
- ప్రజాధనం దుర్వినియోగం కానివ్వం
- రాష్ట్ర పంచాయతీరాజ్, దేవాదాయ శాఖల మంత్రులు సీతక్క, కొండా సురేఖ
- మేడారంలో అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష


అమ్మవార్లకు మొక్కులు చెల్లిస్తున్న మంత్రులు సురేఖ, సీతక్క

**మేడారం మహా జాతరను విజయవంతం చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క), దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. మహాజాతరపై అధికారులతో మేడారంలో బుధవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఏవైనా సమస్యలుంటే అధికారులు తమ దృష్టికి తేవాలని చెప్పారు. పనుల్లో రాజీ పడే ప్రసక్తే లేదని, అధికారులను పరుగెత్తించి మరీ జాతర పనులను పూర్తి చేయిస్తామన్నారు. మేడారం జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.**

**- ములుగు, జనవరి17 (నమస్తే తెలంగాణ)/ తాడ్వాయి**

మేడారంలో అమ్మవార్లను మంత్రులు సీతక్క, కొండా సురేఖ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వారికి పూజారులు, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ అంబరీశ్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ ఘనంగా స్వాగతం పలికారు. డోలివాయిద్యాలతో గద్దెల వద్దకు తీసుకెళ్లగా వారు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజుకు పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు మంత్రులకు అమ్మవార్ల వస్త్రాలతో పాటు ప్రసాదం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన మేడారం జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ.75 కోట్లు మంజూరు చేయగా టెండర్లు నిర్వహించి పనులు చేపట్టినట్లు తెలిపారు. మరిన్ని నిధులు కావాలని ప్రభుత్వాన్ని కోరగా రూ.35 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో శాశ్వత పనులు చేపడుతామని, నాణ్యతపై రాజీపడేది లేదన్నారు. 90శాతం మేర పనులు నెలాఖరు వరకు పూర్తి చేస్తామన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూస్తూ అధికారుల వెంట పడి పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు. దేవాదాయ శాఖ నుంచి రూ.1.50 కోట్లతో పూజారుల భవనానికి శంకుస్థాపన చేసినట్లు వివరించారు. ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు చేసి జాతర విజయవంతానికి సహకరించాలని కోరారు. జాతరలో పూజారుల పాత్ర కీలకమని, వారి కోసం ప్రభుత్వం 10 గదులతో అతిథి గృహ నిర్మాణం చేపడుతోందని, వచ్చే జాతర నాటికి అందుబాటులోకి తెస్తామని మంత్రి సురేఖ వివరించారు. వరదల కారణంగా మేడారం ప్రాంతంలో భారీ నష్టం వాటిల్లిందని, మేడారం జాతర నిధులతో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను పాటించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. వారికి వంతపాడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే జాతరలో మరిన్ని నిధులు కేటాయించి మేడారాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మేడారం మహా జాతరకు జాతీయ హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇందుకు కృషి చేయాలని కోరారు. జాతరకు వచ్చే మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, వేణుగోపాల్, డీఎఫ్‌వో రాహుల్‌కిషన్‌జాదవ్, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### శానిటేషన్ భవనం ప్రారంభం

జాతర అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.20లక్షలతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన శానిటేషన్ భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పూజారుల అతిథి గృహానికి శంకుస్థాపన చేశారు.


ఏకశిల పార్కులోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద నిరసనలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

# దుండగులను కఠినంగా శిక్షించాలి

- జయశంకర్ సార్ విగ్రహ ధ్వంసంపై స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్
- ఏకశిల పార్క్ వరకు ర్యాలీ, జయశంకర్ విగ్రహం వద్ద నిరసన

హనుమకొండ, జనవరి 17 : హైదరాబాద్‌లోని అల్విన్ కాలనీలో తెలంగాణ ఉద్యమకర్త దివంగత ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయం నుంచి ఏకశిల పార్క్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు నల్లబ్యాడ్జీలు ధరించి, నల్ల జెండాలు పట్టుకొని ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణలో తొలి, మలిదశ ఉద్యమకారులను ఏకం చేశారని తెలిపారు. జరుగుతున్న అన్యాయాన్ని సభలు, సమావేశాలు నిర్వహించి వివరించి ప్రజలను చైతన్యపరిచారని పేర్కొన్నారు. ఆ మహనీయుడి విగ్రహాన్ని తెలంగాణ వ్యతిరేకులు ధ్వంసం చేస్తుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించకపోవడం విచారకరమన్నారు. స్వయంగా పోలీస్ అధికారులు అక్కడ ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కనీసం వారిని అడ్డుకోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి దుండగులను వెంటనే అరెస్టు చేయాలని, అదే స్థలంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని మళ్లీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కుడా మాజీ చైర్మన్లు సుందర్‌రాజ్ యాదవ్, మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు చెన్నం మధు, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, పార్టీ సీనియర్ నాయకులు పులి రజినీకాంత్, నయీముద్దీన్, పరశురాములు, వెంకటేశ్వర్లు, బైరపాక ప్రశాంత్ పాల్గొన్నారు.


గద్దెల ప్రాంగణంలో భక్తుల రద్దీ

# మేడారం.. జనసంద్రం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- జంపన్నవాగులో స్నానాలు
- అమ్మవార్లకు మొక్కులు

తాడ్వాయి, జనవరి17 : వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు కొలువైన మేడారం బుధవారం జనసంద్రమైంది. అమ్మవార్లను దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే గాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది. జంపన్నవాగులో పుణ్యస్నానాలాచరించి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి గద్దెల వద్దకు చేరుకొని పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం(బెల్లం), నూతన వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చల్లంగ చూడు సమ్మక్క తల్లీ అంటూ వేడుకున్నారు. అనంతరం జాతర పరిసరాల్లో విడిది చేసి సరదాగా గడిపారు. వాహనాలు వేలాదిగా రావడంతో పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూశారు. గద్దెల సమీపంలో తాత్కాలిక పార్కింగ్ ఏర్పాటు చేశారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో క్యూలైన్లలో పంపించారు. 50వేల మంది భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు.


పుష్కరిణిలో త్రిశూల స్నానం నిర్వహిస్తున్న అర్చకులు

## వైభవంగా నాగవెల్లి, వసంతోత్సవం

**కన్నుల పండువగా త్రిశూల స్నానం.. ఆకట్టుకున్న వీరశైవుల విన్యాసాలు**



భీమదేవరపల్లి, జనవరి 17: కొత్తకొండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయంలో నాగవెల్లి, వసంతోత్సవం కార్యక్రమాలు జరిగాయి. భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవ మూర్తులకు వసంత మండపంలో నీలలోహిత పూజ నిర్వహించారు. నల్లపూసలను భద్రకాళి అమ్మవారికి ధరింపజేశారు. అనంతరం ఊయల ఊపి సప్తవర్ణాల ఏకాంత సేవ నిర్వహించగా తేజోరూపుడై ఉన్న స్వామి వారిని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. బుధవారం త్రిశూలస్నానం కనులపండువగా జరిగింది. గణపతిపూజ, గవ్యాంతం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, మహాకుంభాభిషేకం, అవభృతం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో తీసుకురాగా ఈవో కిషన్‌రావు, ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సాయిబాబు త్రిశూల కలశాలను ఎత్తుకున్నారు. శ్రీశైలం దేవస్థానానికి చెందిన వీరశైవులు మంగళవాయిద్యాల నడుమ వీరభద్ర పల్లేరం చేశారు. వీరశైవులు విన్యాసాలు చేస్తుండగా ఉత్సవమూర్తులను, త్రిశూల కలశాలను పవిత్ర కోనేరుకు తీసుకెళ్లి స్నపనం నిర్వహించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున కోనేరులో పవిత్రస్నానాలు ఆచరించారు. ఈ త్రిశూల స్నానం చేయడం వల్ల శారీరక రుగ్మతలు తొలగి శరీరం కాంతివంత మవుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.


**నేడు అగ్నిగుండాలు**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వేకువజామున అగ్నిగుండాలు నిర్వహించనున్నారు. శరభ శరభ అంటూ భక్తులు నిప్పుకణికలపై భక్తిపారవశ్యంతో నడుస్తారు. సాయంత్రం స్వామి వారి గ్రామ పర్యటన ఉంటుంది. ఈ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం అవుతాయని ఈవో కిషన్‌రావు తెలిపారు.

## వైభవంగా మహాసంప్రోక్షణ

**ఐనవోలు జాతర పరిసమాప్తం**

ఐనవోలు, జనవరి 17: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం మహాసంప్రోక్షణ కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పవిత్ర జలాలతో మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవి, రేణుకా ఎల్లమ్మ ఆలయాలను సంప్రోక్షణ చేశారు. అనంతరం అర్ధప్రానవట్టం లింగానికి అన్నపూజ చేసి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ గావించారు. కార్యక్రమంలో ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు ఐనవోలు మధుకర్‌శర్మ, పాతర్లపాటి శ్రీనివాస్, వేద పండితులు పురుషోత్తంశర్మ, విక్రాంత్ వినాయక్ జోషి పాల్గొన్నారు. మహాసంప్రోక్షణ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం జఫర్‌గఢ్ మండలం కూనూర్ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఉమామహేశ్వర ఆలయం నుంచి డోలు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు.


ఈవో నాగేశ్వర్‌రావు, ఉత్సవ కమిటీ సభ్యులకు పట్టువస్త్రాలు అందజేస్తున్న కూనూర్ ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

## రైతులకు సాగునీటి భరోసా కల్పించాలి


- నాలుగేళ్లు రెండు పంటలకు నీళ్లు ఇచ్చిన కేసీఆర్ సర్కార్
- యాసంగి తైబందీపై స్పష్టత ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం
- అన్నదాతల అయోమయానికి ఎమ్మెల్యే దొంతి తెరదించాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్

నర్సంపేట, జనవరి 17: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీటి విషయంలో భరోసా కల్పించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నర్సంపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, కాంగ్రెస్ నాయకుల ప్రకటనలతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ సర్కార్ నర్సంపేట నియోజకవర్గంలో ఇరిగేషన్ సర్క్యూట్ ప్లాన్ ప్రకారం గోదావరి జలాలను తీసుకొచ్చి నాలుగేళ్లపాటు రెండు పంటలకు సమృద్ధిగా నీరందించినట్లు గుర్తుచేశారు. ప్రత్యేక ప్రణాళికతో గోదావరి జలాలను తీసుకొచ్చామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందిస్తుందా? లేదా? అని రైతులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సాగునీటిపై ఒక్కసారైనా అధికారులతో సమీక్షించారా అని ప్రశ్నించారు. గతంలో పూడుకుపోయిన డీబీఎం 38, 40, 48 కాల్వలను తాము పునరుద్ధరించి, కాకతీయ కాల్వపై క్రాస్ రెగ్యులేటరీ నిర్మించి సమృద్ధిగా నీరందించి పంటల సాగుకు కృషి చేశామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీరందించామని స్పష్టం చేశారు. గతంలో పాకాలకు గోదావరి జలాలు రావడం బూటకమని కాంగ్రెస్ నాయకులు అన్నారని, ఇప్పుడు ఏ ప్రాతిపదికన తైబందీ ఖరారు చేశారో ఎమ్మెల్యే చెప్పాలని డిమాండ్ చేశారు. గోదావరి ప్రాజెక్టులో నీటి నిల్వలు ఉన్నప్పటికీ ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీళ్లు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సమక్షంలో 100 శాతం తైబందీని ఖరారు చేసిన తర్వాత రైతులు నార్లు పోసుకున్నారని గుర్తుచేశారు. తక్షణమే ఎమ్మెల్యే దొంతి సాగునీటిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమీక్షించి, రైతుల అయోమయానికి తెరదించాలని పెద్ది డిమాండ్ చేశారు. సమావేశంలో ఖానాపురం ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామీనాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ ఖానాపురం మండల అధ్యక్షుడు వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, సుధాకర్, యువరాజు పాల్గొన్నారు.

## మూడో లైన్‌పై రైళ్ల రవాణాకు గ్రీన్ సిగ్నల్

**హసన్‌పర్తి రోడ్డు టు మాణిక్‌ఘర్ వరకు క్లియర్**

**బల్లార్ష సెక్షన్‌లో రైళ్ల ఆలస్యానికి చెక్**



కాజీపేట, జనవరి 17 : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే డివిజన్ కాజీపేట రైల్వే సబ్ డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్ - బల్లార్ష సెక్షన్‌లోని మూడో లైన్ రైళ్లు పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. ఈ మార్గంలో నిత్యం వందలాది గూడ్స్, ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తుండగా రద్దీగా ఉంటోంది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలి సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఎంపీలు బల్లార్ష-కాజీపేట రైల్వే జంక్షన్‌కు మూడో లేన్ ఏర్పాటు చేయాలని పలు దఫాలుగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. ఈమేరకు కేంద్రం 2015-16 రైల్వే బడ్జెట్‌లో కాజీపేట రైల్వే జంక్షన్ - బల్లార్ష సెక్షన్‌లో (తెలంగాణ, మహారాష్ట్రలలో) హసన్‌పర్తి రోడ్డు - మాణిక్‌ఘర్ రైల్వేస్టేషన్ వరకు 202 కిలోమీటర్ల మూడో లైన్ నిర్మాణానికి రైల్వేబోర్డు రూ.2,063కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు యుద్ధప్రాతిపాదికన జరిగాయి. రైల్వేశాఖ రాఘవపూర్ - మందమర్రి వరకు 33కిలోమీటర్లు, సిర్పూర్ కాగజ్‌నగర్ - మాణిక్‌ఘర్ వరకు 60 కిలోమీటర్ల మూడో లైన్‌ను గతంలోనే పూర్తి చేయగా ఆ లైన్ల మీదుగా గూడ్స్, ప్యాసింజర్ రైళ్లను ఇప్పటికే నడిపిస్తున్నారు. హసన్‌పర్తి రోడ్డు - ఉప్పల్ రైల్వేస్టేషన్ వరకు మూడోలైన్ పనులు అన్ని విధాలా పూర్తి కావడంతో ఇటీవల రైల్వే జీఎం ఏకే జైన్ ఆదేశాలతో రైల్వే ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించి ఆ పట్టాల మీదుగా గూడ్స్, ప్యాసింజర్ రైళ్లను నడిపించవచ్చని గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. హసన్‌పర్తి రోడ్డు - మాణిక్‌ఘర్ రైల్వేస్టేషన్ వరకు మూడో లైన్‌లో రైళ్లు షురువైతే మహారాష్ట్రలోని మాణిక్‌ఘర్‌కు నేరుగా రైళ్లు వెళ్తాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. ఈ మూడో లైన్ ఏర్పాటుతో కాజీపేట - బల్లార్ష సెక్షన్‌లో రైళ్ల రాకపోకల్లో ఆలస్యం ఉండదని, రైల్వేశాఖకు ప్యాసింజర్, సరుకు రవాణా (గూడ్స్) రైళ్లతో భారీగా ఆదాయం సమకూరుతుందని అంటున్నారు.